నేడు 11 గంటల్లోపు తేల్చండి

- లేకుంటే 12 గంటలకు కార్యాచరణ
- మరాఠా కోటాపై మహారాష్ట్ర సర్కారుకు జరాంగే అల్టిమేటం

ముంబై, జనవరి 26: మరాఠా కోటా రిజర్వేషన్లపై శనివారం ఉదయం 11 గంటల్లోపు తేల్చాలని ఉద్యమకారుడు మనోజ్ జరాంగే మహారాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు. రిజర్వేషన్లకు సంబంధించి శుక్రవారం రాత్రిలోపు ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేశారు. లేకుంటే శనివారం 12 గంటలకు తన కార్యాచరణను ప్రకటిస్తానని హెచ్చరించారు. మరాఠాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మనోజ్ జరాంగే నేతృత్వంలో కొంతకాలంగా ఉద్యమం కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే రిజర్వేషన్లు కల్పించడానికి గడువు కోరిన ప్రభుత్వం.. గడువు తీరినా కూడా స్పందించకపోవడంతో తాడోపేడో తేల్చుకోవడానికి జరాంగే నేతృత్వంలో వేల మంది ముంబై దిశగా ర్యాలీ చేపట్టారు. అయినా ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో తాజాగా జరాంగే డెడ్‌లైన్ విధించారు. 'రిజర్వేషన్ల కోసం ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్నది. ర్యాలీ దాదాపు ముంబై దగ్గరికి వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం చెప్పే మాటలు వినే పరిస్థితి లేదు. కాబట్టి ప్రభుత్వం శనివారం ఉదయం 11 గంటలలోపు అధికార ప్రకటన చేయాలి. లేకుంటే 12 గంటలకు కార్యాచరణ ప్రకటిస్తా. మా అడుగులు ముంబైలోని ఆజాద్ మైదాన్ దిశగానే పడుతాయి. ఒక్కసారి అడుగు పడిందంటే వెనక్కి తిరిగి చూసేది లేదు. మా డిమాండ్‌ను సాధించుకున్నాకే తిరిగి ఇంటికి వెళ్తాం' అని జరాంగే ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం నుంచే తిండి తినడం మానేశానని, కేవలం నీళ్లు తాగుతున్నానని తెలిపారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్‌ను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర విద్యా శాఖ మంత్రి దీపక్ కేసార్కర్ స్పందిస్తూ జరాంగే డిమాండ్లను అంగీకరిస్తున్నామని, ప్రభుత్వ విధానాల ప్రకారం వీటిని నెరవేరుస్తామని చెప్పారు. మరోవైపు ముంబైలోని ఆజాద్ మైదాన్‌లోకి ప్రవేశించేందుకు మరాఠా ఉద్యమకారులకు అనుమతి లేదని పోలీసులు చెప్పారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శుక్రవారం నవీ ముంబైలో కొనసాగిన ర్యాలీలో ప్రజలకు మనోజ్ జరాంగే అభివాదం

కేంద్రంపై రైతుల గర్జన

- పంజాబ్‌లో ట్రాక్టర్లతో ర్యాలీలు
- మోదీ సర్కార్ హామీలు అమలు చేయకపోవడంపై ఆగ్రహం

చండీగఢ్: హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వ తీరుపై రైతులు కన్నెర్ర చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం పంజాబ్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. మూడు వ్యవసాయ చట్టాల రద్దు సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని అన్నదాతలు మండిపడ్డారు. కనీస మద్దతు ధర, రుణాల మాఫీ తదితర హామీలను కేంద్రం మరిచిందని విమర్శించారు. లఖీంపూర్ హింసాత్మక ఘటన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'ఎంఎస్పీ చట్టబద్ధతకు డిమాండ్ చేస్తున్నాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్రం చెప్పింది. అది అమలు కాకపోగా మా రుణాలు రెట్టింపయ్యాయి' అని రైతు నాయకుడు హరీందర్ లోఖోవాల్ తెలిపారు. తెహసిల్, జిల్లా కేంద్రాలు కలిసి సుమారు వంద ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించినట్టు రైతు నాయకుడు బల్బీర్ సింగ్ రాజేవాల్ తెలిపారు. 'మా డిమాండ్లను నెరవేర్చకపోతే ఫిబ్రవరి 16న భారత్ బంద్ చేపడతాం' అని ఆయన వెల్లడించారు.

పుట్టినప్పుడే విడిపోయి.. 19 ఏండ్లకు కలిసి!

న్యూఢిల్లీ, జనవరి 26: వారిద్దరు కవలలు.. అనుకోని పరిస్థితుల్లో పుట్టినప్పుడే విడిపోయారు.. పక్క పక్క వీధుల్లో నివసిస్తున్నా, 19 ఏండ్ల పాటు ఒకరంటే ఒకరికి తెలియదు. తాజాగా ఓ టిక్‌టాక్ వీడియో, టీవీ షో వారిద్దరిని కలిపాయి. బాలీవుడ్ సినిమా 'సీత ఔర్ గీత'లా వీరి జీవితం ట్విస్టులతో సాగింది. జార్జియాకు చెందిన కవలలు అమీ క్విటియా, అనో సార్టానియా పుట్టగానే కన్న తండ్రి వారిద్దరిని అమ్మేశాడు. ఒకే పట్టణంలో నివసించినా ఇద్దరికి ఎన్నడూ తారసపడలేదు. ఓ రోజు అమీ ఓ టీవీ షో చూస్తుండగా, తన పోలికతో ఓ అమ్మాయి డ్యాన్స్ చేస్తుండటాన్ని చూసి షాక్ అయ్యింది. ఆమె తన సోదరి అని తెలియదు. మరోవైపు, అనోకు నీలి రంగు జుట్టుతో తనలాగే ఉండే మరో అమ్మాయి టిక్‌టాక్ వీడియో షేర్ అయ్యింది. వీడియోలో ఉన్న యువతి అమీ అని నిర్ధారించుకున్నది. ఒకరినొకరు కలిసి తాము విడిపోవటానికి కారణాలు తెలుసుకొని షాక్ అయ్యారు. 2002లో వీరిద్దరికి జన్మనిచ్చిన వెంటనే తల్లి కోమాలోకి వెళ్లిపోయింది. వాళ్ల తండ్రే వాళ్లిద్దరిని వేర్వేరు కుటుంబాలకు అమ్మేశాడు.

నరమేధాన్ని ఆపండి

- ఇందుకు తగిన చర్యలు చేపట్టాలి
- గాజాలో క్షతగాత్రులకు మానవతా సాయానికి అవకాశం ఇవ్వాలి
- ఆదేశాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలపై నెలలో వివరణ ఇవ్వాలి
- ఇజ్రాయెల్‌కు అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలు
- వాటిని పట్టించుకోం: ఇజ్రాయెల్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): గాజాలో ఇజ్రాయెల్ మారణ హోమానికి పాల్పడుతున్నదంటూ దక్షిణాఫ్రికా చేసిన ఫిర్యాదుపై ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ న్యాయస్థానం (ది ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే)) శుక్రవారం కీలక ఆదేశాలిచ్చింది. గాజాలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపేయాలంటూ ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. దీని కోసం అవసరమైన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలని పేర్కొంది. గాజాలో జరిగిన దాడుల్లో గాయపడ్డ పౌరులకు మానవతా సాయాన్ని కొనసాగించేలా చూడాలని కూడా కోర్టు సూచించింది. తమ ఆదేశాలకు అనుగుణంగా తీసుకొన్న చర్యలపై నివేదికను నెలలోగా సమర్పించాలని ఇజ్రాయెల్‌ను ఆదేశించిన న్యాయస్థానం.. తమ పరిధి మేరకు మాత్రమే ఈ ఆదేశాలనిస్తున్నట్టు వెల్లడించింది. అయితే, కాల్పుల విరమణకు ఆదేశాలివ్వాలంటూ దక్షిణాఫ్రికా చేసిన విజ్ఞప్తిపై కోర్టు స్పందించలేదు.

దక్షిణాఫ్రికా ఏమని ఫిర్యాదు చేసింది?

గాజాలో ఇజ్రాయెల్ మానవ హననానికి పాల్పడుతున్నదంటూ దక్షిణాఫ్రికా ఐసీజేకు ఫిర్యాదు చేసింది. గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ సైనిక చర్య భారీ ఆస్తి, ప్రాణ నష్టానికి దారి తీస్తున్నదని, దానిని ఆపేందుకు మధ్యంతర ఉత్తర్వులను ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

ఆదేశాలను ఇజ్రాయెల్ పాటిస్తుందా?

ఐక్యరాజ్య సమితి సహా అంతర్జాతీయ సంస్థలు, అత్యున్నత న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను ఇజ్రాయెల్ పట్టించుకొన్న చరిత్ర లేదు. దక్షిణాఫ్రికా ఐసీజే గడప తొక్కడంపై ఇప్పటికే ఇజ్రాయెల్ స్పందించింది. ఈ ఫిర్యాదుకు లీగల్ ఫౌండేషన్ లేదని స్పష్టం చేసింది. రాజకీయ లబ్ధిలో భాగంగానే దక్షిణాఫ్రికా ఈ కేసు వేసిందని ఆరోపించింది. ఇలాంటి ఆరోపణలను ఆధారం చేసుకొని ఐసీజే ఇచ్చిన ఈ ఆదేశాలకు తాము కట్టుబడి ఉండబోమని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. హమాస్‌ను అంతమొందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

హమాస్ ఏమన్నది?

ఐసీజే ఆదేశిస్తే ఇజ్రాయెల్‌తో యుద్ధంలో కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని గురువారం హమాస్ ప్రకటించింది. అయితే, ఇజ్రాయెల్ సైన్యం కూడా దాన్ని అమలు చేయాలని షరతు విధించింది.

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఏం జరిగింది?

2022లో ఉక్రెయిన్-రష్యా మధ్య మొదలైన యుద్ధంపై కూడా ఐసీజే కీలక ఆదేశాలిచ్చింది. దాడులను వెంటనే నిలిపేయాల్సిందిగా రష్యాను ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలను రష్యా పట్టించుకోలేదు.

ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంక్షోభం ఎందుకు?

జెరూసలెంలో ఉండే అల్-అఖ్సాను ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు, ముస్లింలు, యూదులు అత్యంత పవిత్ర స్థలంగా భావిస్తారు. దీన్ని తమ ఆధీనంలోకి తీసుకొని ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలన్నదే తమ లక్ష్యమని ఇప్పటికే హమాస్ ప్రకటించింది. అయితే, అల్-అఖ్సా ఇజ్రాయెల్ సేనల రక్షణ వలయంలో ఉన్నది.

'ఇంజెన్యూటీ' కథ కంచికి

- అంగారకుడిపై ముగిసిన నాసా హెలికాప్టర్ ప్రస్థానం

కాలిఫోర్నియా: అంగారక గ్రహంపై పరిశోధనలకు మూడేండ్ల క్రితం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ పంపిన బుల్లి హెలికాప్టర్ 'ఇంజెన్యూటీ' కథ ముగిసింది. ఇతర గ్రహంపై ఎగిరిన తొలి హెలికాప్టర్‌గా చరిత్ర సృష్టించిన 'ఇంజెన్యూటీ' ప్రస్తుతం ఎగరలేని స్థితిలో ఉన్నట్టు నాసా ప్రకటించింది. ఈ నెల 18న దీన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేస్తుండగా రోటర్ బ్లేడ్లు దెబ్బతినడమే ఇందుకు కారణమని వెల్లడించింది. ప్రస్తుతం 'ఇంజెన్యూటీ' సాధారణ స్థితిలో నిలబడే ఉన్నప్పటికీ రోటర్ బ్లేడ్లు దెబ్బతినడం వల్ల పైకి ఎగరలేకపోతున్నదని, దీంతో ఆ హెలికాప్టర్ ప్రయాణం ముగిసినట్టేనని వివరించింది. 'పర్సెవరెన్స్' రోవర్ ద్వారా 2021 ఫిబ్రవరిలో అంగారక గ్రహంపైకి చేరిన ఈ హెలికాప్టర్ ఇప్పటికే అంచనాలకు మించి పనిచేసినట్టు నాసా పేర్కొన్నది. ఇప్పటివరకు ఇది అరుణ గ్రహ వాతావరణంలో 72 సార్లు ఎగిరిందని, ఇది అనుకున్న దానికంటే 14 సార్లు ఎక్కువని తెలిపింది. ఎత్తు పల్లాలతో ఎగుడుదిగుడుగా ఉండే అంగారక గ్రహ ఉపరితలంపై సరైన ల్యాండింగ్ ప్రదేశాలను తనంతట తానే ఎంపిక చేసుకోగలిగేలా 'ఇంజెన్యూటీ'ని గత కొన్నేండ్లలో ఎంతో అప్‌గ్రేడ్ చేశామని, దీంతో ఆ హెలికాప్టర్ ఓ సందర్భంలో అరు ణ గ్రహంపై శీతాకాలంలో ధూళి తుఫాను అనంతరం తనంతట తాను శుభ్రం చేసుకోవడంతో పాటు సెన్సర్ సమస్యను కూడా చక్కదిద్దుకోగలిగిందని నాసా వివరించింది.

సోషల్ మీడియా ఆరోగ్యానికి హానికరం

- పొగాకు, గన్‌కల్చర్‌లా ప్రమాదకరం
- ప్రకటించిన న్యూయార్క్ నగరం

న్యూయార్క్: చాలామంది దైనందిన జీవితాల్లో సోషల్‌మీడియా ఓ భాగమైపోయింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్), యూట్యూబ్, వాట్సాప్ వంటి వేదికలను యువత నుంచి వృద్ధులకు వరకూ అధికంగా వినియోగిస్తున్నారు. ఇది మానసిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నదని ఇప్పటికే పలు అధ్యయనాలు వెల్లడించాయి. వీటిని పరిగణనలోకి తీసుకొన్న అమెరికాలోని న్యూయార్క్ సోషల్ మీడియాను పొగాకు, గన్స్‌లాగా ప్రజారోగ్యానికి ప్రమాదకరం, పర్యావరణ విషం అని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ సోషల్ మీడియా వాడకంపై మార్గదర్శకాలు కూడా జారీచేశారు. టిక్‌టాక్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వాడకంతో పిల్లల్లో మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక మాధ్యమం వినియోగంపై మార్గదర్శకాలు జారీచేసిన తొలి అమెరికన్ నగరంగా న్యూయార్క్ నిలిచింది.

పిల్లల్లో తీవ్ర మానసిక కుంగుబాటు

సోషల్ మీడియాను రోజులో ఎక్కువసేపు వినియోగిస్తుండటంతో పిల్లల్లో డిప్రెషన్ స్థాయిలు దశాబ్దంలోనే గరిష్ఠ స్థాయిని తాకినట్టు పలు అధ్యయనాల్లో తేలింది. వారాంతాల్లో 77 శాతం మంది హైస్కూల్ విద్యార్థులు హోంవర్క్‌ను వదిలేసి రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ గంటలసేపు స్క్రీన్‌కు అతుక్కుపోతున్నట్టు గుర్తించారు. సోషల్ మీడియా విపరీత వినియోగం ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నదని న్యూయార్క్ నగర డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ మెంటల్ హైజీన్ తేల్చింది. సోషల్‌మీడియా వాడకంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు పరిమితి విధించాలని ఆడమ్స్ మార్గదర్శకాల్లో సూచించారు. టీనేజర్లు ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు నోటిఫికేషన్లను ఆపేస్తూ.. మానసిక ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. టిక్‌టాక్, యూట్యూబ్ ఫేస్‌బుక్‌లాంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలు పిల్లలను వ్యసనపరులుగా మార్చేలా ఫీచర్స్‌ను అందుబాటులోకి తెచ్చి, పిల్లల్లో మానసిక ఆరోగ్య సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయని తెలిపారు. తమ నగర టీనేజర్లను వీటికి బానిసలుగా మారకుండా మార్గదర్శకాలు జారీ చేసినట్టు చెప్పారు.

బోయపాటి శ్రీను, అల్లు అరవింద్

మాస్ జాతరకు సిద్ధం

మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కు పెట్టింది పేరు అగ్ర దర్శకుడు బోయపాటి శ్రీను. ఉత్తమాభిరుచితో కూడిన జనరంజకమైన చిత్రాల్ని తెరకెక్కించడంతో సిద్ధహస్తుడు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. వీరిద్దరిది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. తాజాగా ఈ కాంబోలో భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతున్నది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ సంస్థ తెరకెక్కించిన 'సరైనోడు' (2016) చిత్రం అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుదీర్ఘ విరామం తర్వాత దర్శకుడు బోయపాటి శ్రీను గీతా ఆర్ట్స్ సంస్థలో సినిమా చేయబోతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

భారతీయులంతా నా సహోదరులు!

నితిన్

హీరో నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం 'రాబిన్ హుడ్'. వీరిద్దరు కలిసి గతంలో 'భీష్మ' చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రాబిన్ హుడ్' రూపొందుతోంది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా టైటిల్ రివీల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. భారతీయులందరూ తన సోదరులు, సోదరీమణులుగా భావించి, వారి నుంచి డబ్బు దొంగిలించడానికి తనకు అన్ని హక్కులు ఉన్నాయని చెప్పే నితిన్ పాత్రను పరిచయం చేస్తూ రివీల్ చేసిన టైటిల్ గ్లింప్స్ ఆకట్టుకుంది. 'డబ్బు చాలా చెడ్డది. రూపాయి రూపాయి నువ్వేం చేస్తావ్ అంటే.. అన్నదమ్ముల మధ్య, అక్కాచెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతాను అంటది. అన్నట్టే చేసింది. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ములు.. ఆభరణాలేసుకున్నోళ్లంతా నా అక్కాచెల్లెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే.. ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు. అయినా నేను హర్ట్ అవ్వలేదు. ఎందుకంటే అయినవాళ్ల దగ్గర డబ్బులు తీయడం నా హక్కు. మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అంటూ సాగే హ్యూమర్స్ డైలాగ్‌తో నితిన్ తనను తాను పరిచయం చేసుకోవడం ఆసక్తికరంగా ఉంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు కెమెరా: సాయిరాం, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

శింబు జోడీగా..

దీపికా పడుకోన్

మంగళూరు సోయగం దీపికా పడుకోన్ దక్షిణాది సినిమాలపై ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తున్నది. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి' చిత్రంలో నాయికగా నటిస్తున్న ఈ భామ త్వరలో ఓ తమిళ చిత్రంలో భాగం కాబోతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మించబోతున్న భారీ పీరియాడిక్ చిత్రంలో శింబు కథానాయకుడిగా నటించనున్నారు. దేశింగు పెరియస్వామి దర్శకుడు. ఈ చిత్రంలో శింబు హీరో, విలన్‌గా ద్విపాత్రాభినయం చేయబోతున్నారని చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్న ఈ చిత్రంలో దీపికా పడుకోన్ కథానాయికగా నటించనుందనే వార్తలొస్తున్నాయి. కథలోని కొత్తదనం నచ్చడంతో దీపికా పడుకోన్ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిగా ఉందని అంటున్నారు. మరో నాయికగా కీర్తి సురేష్ నటించనుందని తెలుస్తున్నది. సుదీర్ఘ విరామం తర్వాత దీపికా పడుకోన్ తమిళ ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇవ్వనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టైటిల్‌ను ఫిబ్రవరి మూడో వారంలో విడుదల చేయబోతున్నారు.

బ్యాగీ ప్యాంట్ బచ్చన్

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. హీరో రవితేజ స్వతహాగా బిగ్‌బి అమితాబ్ బచ్చన్‌కు వీరాభిమాని. చాలా సినిమాల్లో సందర్భానుసారంగా ఆయన్ని అనుకరిస్తూ కనిపించారు. ఇప్పుడు ఆయన పేరును స్ఫురించే టైటిల్‌తో రవితేజ సినిమా చేయడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా కేరళలోని కారంపూడిలో చిత్రీకరణ జరుపుకుంటున్నది. రవితేజతో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. శుక్రవారం వింటేజ్ లుక్‌లో రవితేజ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన బ్యాగీ ప్యాంట్‌లో కనిపిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, రవితేజ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఆయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: హరీష్‌శంకర్.

చిత్రం

రవితేజ

ఏప్రిల్‌లో 'ఫ్యామిలీ స్టార్'

స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా సినిమా 'ఫ్యామిలీ స్టార్'. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందిస్తున్న 54వ చిత్రమిది. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమా వేసవిలో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమవుతోందని తెలిసింది. ఫిబ్రవరి 20కల్లా చిత్రీకరణ ముగించుకొని ఏప్రిల్ 5వ తేదీన విడుదల చేయనున్నట్లు సమాచారం. వాస్తవానికి జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'దేవర' కోసం మేకర్స్ ఈ డేట్ ఖరారు చేసుకున్నారు. అయితే అనివార్య కారణాల వల్ల 'దేవర' రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'ఫ్యామిలీ స్టార్' ఏప్రిల్ 5న రానున్నట్లు చిత్రసీమలో టాక్ నడుస్తోంది. 'ఫ్యామిలీ స్టార్'లో కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్, నిర్మాతలు: దిల్ రాజు, శిరీష్, రచన-దర్శకత్వం: పరశురామ్ పెట్ల.

అనుపమ పరమేశ్వరన్, సిద్ధు జొన్నలగడ్డ

వేసవిలో టిల్లు హంగామా

'డీజే టిల్లు' చిత్రంతో యువతరానికి చేరువయ్యారు యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ. హైదరాబాద్ లోకల్ యూత్ డీజే టిల్లుగా ఆయన పండించిన హాస్యం, సంభాషణలు బాగా గుర్తుండిపోయాయి. ఇప్పుడీ సినిమాకు స్వీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఇప్పటికే విడుదలైన 'టికెట్టే కొనకుండా' 'రాధిక' వంటి పాటలు పాపులర్ అయ్యాయి. తొలుత ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. అయితే అనివార్య కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేయబోతున్నట్లు తాజా ప్రకటనలో నిర్మాణ సంస్థ వెల్లడించింది. కడుపుబ్బా నవ్వించే హాస్యంతో ఈ సినిమా ప్రేక్షకులందరిని ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిప్రకాష్ ఉమ్మడిసింగు, సంగీతం: రామ్ మిరియాల.

ప్రేమ భావోద్వేగాల 'ఉత్సవం'

దిలీప్ ప్రకాశ్, రెజీనా ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వం వహిస్తున్నారు. హార్న్ బిల్ పిక్చర్స్‌పై సురేశ్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో దిలీప్ ప్రకాశ్ ఒక చేతిలో నటరాజ విగ్రహం, మరో చేతిలో కిరీటం పట్టుకొని నేలపై కూర్చొని కనిపించారు. ప్రేమ, భావోద్వేగాలు, వినోదంతో కూడిన పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ నెల 28న టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్‌బీ శ్రీరాం, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి, ఆమని, సుధ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: అనూప్ రూబెన్స్, సాహిత్యం: వనమాలి, భాస్కర భట్ల, అనంత శ్రీరామ్, నిర్మాత: సురేశ్ పాటిల్, రచన-దర్శకత్వం: అర్జున్ సాయి.